క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జేష్టమాసం రెండవ శనివారం సందర్భంగా వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు డీఈఓ కార్యాలయం వద్ద నిరసన

ప్రొద్దుటూరు కల్చరల్ : త్వరలో జరగబోయే అన్ని క్యాడర్ల పదోన్నతులను మ్యాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ విధానంలో నిర్వహించాలని కోరుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు డీఈఓ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. బదిలీల నిబంధనల్లో ఉన్న అసంబద్ధాలను తొలగించాలని, ఖాళీలను బ్లాక్ చేయకుండా జిల్లాలోని అన్ని రకాల టీచర్ల ఖాళీలను బదిలీలకు చూపించాలని ఆయన కోరారు.

'హజ్ యాత్రికులపై దాడి అమానుషం'

ప్రొద్దుటూరు కల్చరల్ : హజ్‌యాత్రికులపై దాడి అమానుషమని అంజుమన్ అహలే ఇస్లాం సెక్రటరీ ఖురైషి ఇలియాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజస్థాన్‌లోని జైపూర్ వెళుతున్న హజ్ యాత్రికుల బస్సును ఆపి యాత్రికులపై, బస్సు డ్రైవర్‌పై దాడి చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. దాడికి పాల్పడ్డ విద్రోహకర శక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

రేపు కుచ్చుపాప గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కుచ్చుపాప గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

'ఆ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి'

వైవీయూ : ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీల నుంచి 2015 నవంబర్‌లో చేరిన ఉపాధ్యాయులను లాంగ్‌స్టాండింగ్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్ కోరారు.

తేనెటీగల పెంపకంతో ఎక్కువ లాభాలు

పులివెందుల రూరల్ : తేనెటీగల పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చునని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాలలో ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్.బేగ్ అధ్యక్షతన తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ హాజరై మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో తేనెటీగల పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చునన్నారు. అనంతరం శిక్షణ నిపుణులు డాక్టర్ శిల్పకళ, అభ్యుదయ రైతు ఎం.ఎస్.రాజులు తేనెటీగల పెంపకంలో సాంకేతికత, మెళకువల గురించి వివరించారు. అనంతరం బాక్సులలో తేనెటీగలను స్వయంగా చూపించి తేనె ఎలా సేకరించాలో క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు ఏడుకొండలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను వెంటనే పునరుద్ధరించాలి

జమ్మలమడుగు : సీపీఎస్ విధానం రద్దుచేసి వెంటనే ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్‌కుమార్, కార్యదర్శి సుదర్శన్‌రెడ్డిలు తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉద్యోగుల సంఘం నాయకులు పిలుపు మేరకు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 1వ తేదీన జీత భత్యాలను చెల్లించడంతోపాటు 12వ వేతన సవరణం చేసి 11వ పీఆర్సీ అమలు చేసి ఒప్పందం ప్రకారం డీఏ అరియర్స్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పి.రాజశేఖర్, జి.రాజేంద్ర, రామమోహన్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పొన్నారి దస్తగిరి దేవదానం తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లంటే ప్రజలకు గౌరవభావం

వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



వలంటీర్‌కు అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యేనైన తనకంటే వలంటీర్లకే ప్రజల్లో ఎక్కువ గౌరవం, నమ్మకం ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ, మండల పరిధిలో పని చేస్తున్న వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరిక నిర్మూలనతోపాటు పిల్లల విద్య కోసం, వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. తద్వారా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదలను ఆదుకుంటున్నారని తెలిపారు. వలంటీర్ల సేవలో సంపదకన్న సంతృప్తి ఎక్కువగా ఉంటుందని, ఎవరికైనా అదే అవసరం అన్నారు. ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లి పార్టీలకతీతంగా సేవ చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఇల్లు ఏదో రకంగా ప్రభుత్వం ద్వారా ప్రయోజనం పొందుతోందని అన్నారు. మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి అయితేనే వలంటీర్ల వ్యవస్థ ఉంటుందన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

అభివృద్ధి, సంక్షేమం తనకు రెండు కళ్లలాంటివని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు సరైన విద్య, వైద్యానికి నోచుకోలేదన్నారు. తాగునీరు అందలేదని, మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.500 కోట్లతో తాగునీటి పథకాలను, పెన్నానదిపై హైలెవెల్ బ్రిడ్జి, ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్, వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని వలంటీర్లు నల్లగాండ్ల జయలక్ష్మి, పోతుల రవికుమార్‌తోపాటు కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని సాయినాథం ఉమాదేవి, సోములవారిపల్లె పంచాయతీ పరిధిలోని అరుణ్‌కుమార్‌కు సేవా వజ్ర అవార్డు కింద ఒక్కొక్కరికి రూ.30వేలు చొప్పున మంజూరైంది. 19 మంది వలంటీర్లకు సేవా రత్న అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కమిషనర్ వెంకటరమణయ్య, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గురుతర బాధ్యతల్ని మోస్తున్న వలంటీర్లు



వలంటీర్‌ను సత్కరించి సర్టిఫికెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించడంలో ఏ ప్రజా ప్రతినిధికి లేని గురుతర బాధ్యతలను వలంటీర్లు మోస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరులోని ఎస్‌సీసీఆర్ కల్యాణ మండపంలో శనివారం జరిగిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధికి అర్హులను ఎంపిక చేస్తూ ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి ఖ్యాతిని తెస్తున్న వలంటీర్లు అభినందనీయులని అన్నారు. సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కులమతాలకు అతీతంగా, అర్హత ఉంటే టీడీపీ కార్యకర్తలకు కూడా సంక్షేమ పథకాలను అందిస్తోందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.కోట్లతో పథకాలను అందిస్తున్న విషయం వలంటీర్లు ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్యే సూచించారు. టీడీపీ హయాంలో పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలకు సొము ముట్టజెప్పాల్సిందేనని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులను ఎంపిక చేసే బాధ్యత వలంటీర్లకు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు.

పది మందికి సేవా రత్నాలు

కార్యక్రమంలో మున్సిపాలిటీలోని ఐదుగురికి, మండలంలోని ఐదుగురికి సేవారత్న అవార్డులను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అందజేశారు. మున్సిపాలిటీకి చెందిన శ్వేత, టి.సుజాత, లక్ష్మి నారాయణమ్మ, లావణ్య, సిసింద్రి, మండలంలోని కిరణ్ బాబు, బండి భారతి, చిన్న వెంకటసుబ్బయ్య, సిద్ధారెడ్డి, రమేష్‌లకు శాలువా, మెడల్, సర్టిఫికెట్‌తో ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, ఎంపీపీ థామస్, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి, ఎంపీడీఓ కుళ్లాయమ్మ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కిరణ్మయి, గోశెట్టి లక్షుమయ్య, భరత్‌కుమార్‌రెడ్డి, పిల్లి నాగమ్మ, మూలె సుబ్బిరెడ్డి, శ్రీనురావు, కరిడి రమణమూర్తి, ట్రాక్టర్ గౌస్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు

పేదలకు పథకాలు అందించడమే సీఎం ధ్యేయం

బ్రహ్మంగారిమఠం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమంటే చాలా సంతోషమని.. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతోనే గ్రామ వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక యోగి అన్నదాన సత్రం వద్ద శనివారం 'గ్రామ వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే వలంటీర్లకు వివిధ పురస్కారాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, సింగిల్ విండో నేలటూరు సుబ్బారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మేకల రత్నకుమార్ యాదవ్, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ భర్త ఉమాపతి, మార్కెట్ యార్డు డైరెక్టర్ భర్త శంకర్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు



గ్రామోత్సవం వెంట ఏర్పాటు చేసిన కోలాటం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండా వధూత ఆశ్రమం, గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూలమూర్తి హోమం, ఉత్సవబలి నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన గరుడవాహనసేవలో శ్రీనివాసుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి సి.శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు కందుకూరి

కడప వైఎస్సార్ సర్కిల్ : నవయుగ వైతాళికుడు సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం అని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు స్త్రీ విద్యను ప్రోత్సహించి వితంతు, పునర్వివాహాల కోసం ఆనాడు పోరాటాలను చేశారని పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేంద్ర ప్రసాద్, షాకీర్, ఓబులేసు పాల్గొన్నారు.

వీసీ ఆకస్మిక తనిఖీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్ శనివారం విశ్వవిద్యాలయంలోని పలుశాఖలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిపాలన భవనంలోని ఎస్టాబ్లిష్‌మెంట్, అకడమిక్, ఫైనాన్స్, డెవలప్‌మెంట్ విభాగాలను, లీగల్‌సెల్‌ను పరిశీలించారు. ఉద్యోగుల హాజరు, వారి విధులకు సంబంధించిన రికార్డులను, ఈ ఫైలింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఒక్కరూ కర్తవ్య దీక్షతో బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. రికార్డులు ఏరోజుకారోజు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అనంతరం పరీక్షల నియంత్రణాధికారి విభాగాన్ని పరిశీలించారు. డీ కోడ్ అయిన పరీక్షల సమాధాన పత్రాలను పరిశీలించారు. వీసీ వెంట రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య ఉన్నారు.

కల్యాణ మండపానికి వేలం పాట

వేంపల్లె : స్థానిక వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం అనుసంధానమైన శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మండపానికి లీజుకు సంబంధించిన వేలం పాట నిర్వహించినట్లు ఈఓ శ్రీధర్, చైర్మన్ కె.వెంకటేష్‌లు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక కల్యాణ మండపం ఆవరణలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. అనంతరం రెండేళ్లపాటు కల్యాణ మండపం లీజుకు రూ.4.35 లక్షలకు వేంపల్లె పట్టణానికి చెందిన టి.రాజేష్‌కుమార్ హెచ్చుపాట పాడి దక్కించుకున్నారు. గతంలో రూ.3.70 లక్షలకు వేలం పాట పాడగా.. ప్రస్తుతం అధికంగా రూ.65 వేలు ఆదాయం చేకూరిందన్నారు.

శరవేగంగా రహదారుల విస్తరణ

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం చొరవ, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, అధికారుల కృషితో కడప నగరంలో అనేక ఏళ్ల తర్వాత రహదారుల విస్తరణ పనులు వేగవంతం అయ్యాయి. కడప చరిత్రలో తొలిసారి అత్యంత రద్దీగా ఉండే రహదారులు విస్తరణకు నోచుకుంటున్నాయి. విస్తరణ వల్ల నష్టపోయే బాధితులకు నష్ట పరిహారం కింద ప్రభుత్వం రూ.40కోట్లు విడుదల చేయగా, అందులో రూ.33కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యింది.

మహిళాభివృద్ధే వీరేశలింగానికి నిజమైన నివాళి



కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఏఆర్ఓ హేమాంజలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మహిళల అభివృద్ధి, సాధికారతే కందుకూరి వీరేశలింగానికి నిజమైన నివాళి అని అటవీ శాఖ ఏఆర్ఓ హేమాంజలి తెలిపారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో శనివారం కందుకూరి వీరేశలింగం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల రద్దు కోసం ఉద్యమించిన గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం అన్నారు. సామాజిక దురాచారాలు, మూఢ నమ్మకాల నిర్మూలన కోసం ఆయన కృషి చేశారని తెలిపారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం అని కొనియాడారు. కార్యక్రమంలో జిరాఫీ చెస్ కోచ్ గంగాధర్‌రెడ్డి, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ గౌరవ సలహాదారుడు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీత, మధుసూదన్‌రెడ్డి, అక్షయ, హాసిని, యోచిత, జాహ్నవి, నిఖిల్ తేజేష్, జావీద్, దస్తగిరి పాల్గొన్నారు.

మహిళల సమస్యలపై దృష్టి సారించండి



మహిళా సంరక్షణ కార్యదర్శులతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు

బద్వేలు అర్బన్ : వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు తమ పరిధిలోని మహిళలతో మమేకమై వారి సమస్యలపై దృష్టి సారించి వారికి బాసటగా నిలవాలని అర్బన్ సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక అర్బన్ స్టేషన్‌లో మహిళా సంరక్షణ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత, సైబర్ నేరాలు సఖి, వన్‌స్టాప్ సెంటర్, చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098 లపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన దిశ చట్టంపై మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. అంతేకాకుండా ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే వాటి వివరాలు కూడా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా వార్డుల మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

మేకల వెంకటన్నకు జాతీయ గౌరవ పురస్కార్



అవార్డు అందుకుంటున్న మేకల వెంకటన్న

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని చౌటపల్లెకు చెందిన ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మేకల వెంకటన్నకు జాతీయ గౌరవ పురస్కార్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని లిటిల్ థియేటర్‌లో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఫౌండర్ ఓంకార్, సౌత్ జోనల్ చైర్మన్ డాక్టర్ శ్యామ్‌సుందర్‌లతో పాటు పలువురు ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

సచివాలయాలను పరిశీలించిన స్టేట్ స్పెషల్ ఆఫీసర్



స్టేట్‌స్పెషల్ ఆఫీసర్ కరుణాకర్‌కు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం, కొత్తపల్లె గ్రామ పంచాయతీల్లోని సచివాలయాలను శనివారం గ్రామ, వార్డు సచివాలయాల స్టేట్ స్పెషల్ ఆఫీసర్ కరుణాకర్ సందర్శించారు. సచివాలయాల్లోని రికార్డులను ఆయన పరిశీలించారు. సచివాలయాల పనితీరు, ఆర్థిక నిర్వహణ, పథకాల అమలుపై సిబ్బందితో ఆయన మాట్లాడారు. కొత్తపల్లె పంచాయతీలోని సచివాలయాల పనితీరు బాగుందని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ సచివాలయ స్టేషనరీ, విద్యుత్ బిల్లులు ప్రతి నెలా గ్రామ పంచాయతీలే భరిస్తున్నాయని తెలిపారు. సచివాలయాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నిధులు కేటాయించాలని స్పెషల్ ఆఫీసర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని తమ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్పెషల్ ఆఫీసర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, గోపవరం ఉపసర్పంచ్ రాఘవేంద్రరెడ్డి, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు చుక్కల భూముల నిషేధిత తొలగింపు పత్రాల పంపిణీ

చాపాడు: స్థానిక వైఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మండలంలోని చుక్కల భూముల బాధితులకు నిషేధిత తొలగింపు పత్రాలను పంపిణీ చేయనున్నట్లు మండల తహసీల్దార్ సుభానీ తెలిపారు. ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి చేతుల మీదుగా మండలంలోని 3755 మంది రైతులకు చెందిన 3623 ఎకరాలకు పత్రాలను పంపిణీ చేస్తారన్నారు.

చంద్రబాబు మోసాలకు నిరసనగా 29న బైక్ ర్యాలీ

మైదుకూరు : చంద్రబాబు 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసినందుకు నిరసనగా సోమవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మైదుకూరులో శనివారం ఆయన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని, బ్యాంకుల్లో రైతుల బంగారును తాకట్టు నుంచి విడిపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఆ హామీలను నెరవేర్చకుండా మహిళలను, రైతులను చంద్రబాబు మోసగించారని ఆరోపించారు. పాత మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చని చంద్రబాబు తాజాగా మహానాడులో కొత్త మేనిఫెస్టోను విడదల చేయడం శోచనీయమన్నారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలను ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరుతూ, చంద్రబాబు ప్రజలను మోసం చేసినందుకు నిరసనగా ఈ బైక్ ర్యాలీ చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. సోమవారం ఉదయం దువ్వూరు సమీపంలోని కోదండ రామాలయం వద్ద నుంచి సుమారు 400 మందితో బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఖాజీపేటలోని బంగ్లా వద్ద బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఏపీఐఐసీ డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మైదుకూరు, దువ్వూరు, చాపాడు ఎంపీపీలు థామస్, జయచంద్రారెడ్డి, లక్షుమయ్య, మైదుకూరు వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మూలె సుధాకర్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి, గల్లా నరసింహారెడ్డి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పద్యాల పోటీ పరీక్ష



రాజుపాలెంలో విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



పోరుమామిళ్లలో వివిధ కళాకృతులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రాజుపాళెం : వేసవి శిక్షణలో భాగంగా పౌర గ్రంథాలయశాఖ మంగళగిరి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన రాజుపాళెంలోని గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు పద్యాల పోటీ పరీక్షలను నిర్వహించారు. ఈ పోటీలకు ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, నరసింహారెడ్డిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి పోటీలలో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి భయం పోతుందన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు నృత్య పోటీలు

పోరుమామిళ్ల : స్థానిక గ్రంథాలయంలో శనివారం లైబ్రేరియన్ ఆఫ్రిది సమ్మర్ క్యాంప్‌లో భాగంగా నృత్యపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా కార్యవర్గ సభ్యులు గఫార్, ఖాసీంవలి, దాదాపీర్ మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులను ఉత్సాహపరిచేందుకు పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. నృత్యపోటీ విజేతలకు ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ హుసేన్ బహుమతులు అందజేశారు.

కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్న బీజేపీ

కడప వైఎస్సార్ సర్కిల్ : దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు విమర్శించారు. శనివారం ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమ్మేళనాల్లో భాగంగా నగరంలోని పాత కలెక్టరేట్ నుంచి ర్యాలీ చేపట్టి మున్సిపల్ ఉర్దూ హైస్కూలు వద్ద కార్మికులతో కలిసి బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్ల పాలనలో కార్మికవర్గం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. దేశ ఆర్థిక సంపదకు మూల కారణమైన కార్మికులపై కక్షసాధింపు ధోరణికి మోదీ కారణమయ్యారని ధ్వజమెత్తారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీలకు ధారాదత్తం చేస్తూ కార్మిక చట్టాలను, హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, డిప్యూటీ కార్యదర్శి వెంకట సుబ్బయ్య, రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాధాకృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, నాయకులు కేసీ బాదుల్లా, మద్దిలేటి, సుభాషిణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం
- ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు
- మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : మున్సిపల్ అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంపై సకాలంలో స్పందించకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో శనివారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో గల ప్రభుత్వ స్థలం పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే సుమిత్రానగర్ నుంచి పూసలవాడకు వెళ్లే రహదారులలో అక్రమ నిర్మాణాలు తొలగించి రోడ్డు వెడల్పు చేయాలని కోరారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని శివారు గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. బద్వేలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక మైదుకూరురోడ్డులోని పాత గుంతపల్లె పంచాయతీ కార్యాలయం స్థలంలో పెట్రోలు బంకు ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని, ఇందుకు కృషి చేసిన మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణకు పురపాలక సంఘం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బద్వేలు అప్పట్లో ఏడ్చేది.. ఇప్పుడు సంతోషంగా ఉంది

ఇటీవల ఓ పత్రికలో బద్వేలు బోరుమంటోంది శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ చైర్మన్ ఘాటుగా స్పందించారు. గత టీడీపీ పాలకవర్గం హయాంలో బద్వేలు మున్సిపాలిటీకి నిధులు లేక ఎలాంటి అభివృద్ధి లేక బద్వేలు బోరుమంటుండేదని, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.130 కోట్లు మంజూరు చేస్తే అందులో రూ.50 కోట్లతో సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే మున్సిపల్ కార్యాలయానికి రూ.3.50 కోట్లతో సొంత భవనాన్ని నిర్మించుకున్నామని, రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు అయ్యాయని ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో బద్వేలు ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు.

సమస్యలు పరిష్కరించని అధికారులు

గత సమావేశాల్లో ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మళ్లీ సమావేశం వచ్చేనాటికి కూడా అధికారులు వాటిని పరిష్కరించడం లేదని ఆయా వార్డుల కౌన్సిలర్లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించడంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని, దీని వలన మిగిలిన పనులు కూడా చేయలేకపోతున్నామని మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, మేనేజర్ మునికుమార్, డీఈ సుమన్‌రెడ్డి, ఏఈలు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.